ఇక నగరం నలుమూలలా పరిశ్రమలు


ఐటీ పార్కుల విస్తరణపై సర్కారు దృష్టి

- ప్రభుత్వ భూముల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు
- పారిశ్రామిక వాడలపై సర్కారు ఫోకస్
- ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యం

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారుల్లో పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వందలాది పరిశ్రమలతో వందలాది మంది నిరుద్యోగులకు, ప్రత్యక్షంగా వేలాది కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించటమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించిన సర్కారు హైదరాబాద్–వరంగల్ పారిశ్రామిక కారిడార్‌తో పాటు మహానగరం నలువైపులా పారిశ్రామిక పార్కులపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. శివారుల్లో ఇప్పటికే గ్రీడ్ పాలసీలో భాగంగా గత ప్రభుత్వం ఉప్పల్ జెన్‌ప్యాక్ వద్ద 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్కుకు శ్రీకారం చుట్టింది. నగరానికి ఉత్తరాన కండ్లకోయలో గేట్‌వే ఐటీ పార్కుకు శంకుస్థాపన చేసింది. వీటిని వేగవంతం చేయడంతో పాటు నగరానికి తూర్పు దిశలో ఘట్కేసర్ మండలం మాదారంలో ఇండస్ట్రియల్ పార్కు స్థాపనకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రభుత్వ భూముల వివరాలపై సర్కారు ఆదేశాలతో అధికార యంత్రాంగం... శివారు జిల్లాల్లో గుర్తించే పనిపై నిమగ్నమైంది. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూముల గుర్తింపుపై చర్యలకు ఉపక్రమిస్తోంది.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో...

పారిశ్రామిక పార్కుల ఏర్పాటు కోసం జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించటంతో పాటు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వే సౌకర్యం, నీటి సరఫరా, స్థానికులకు ఉద్యోగ అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి సూచించింది. ఆ దిశగా చర్యలకు ముందడుగు వేస్తోంది. కొండలు, గుట్టలు అటవీ భూములు కాకుండా ఇతర భూములను ఎంపిక చేయాలని కోరటంతో పాటు ప్రభుత్వ భూములు అందుబాటులో లేకుంటే ప్రైవేట్ భూములను కూడా గుర్తించి, వాటి బహిరంగ మార్కెట్ ధర, ప్రభుత్వ ధరలను తెలపాలని పేర్కొనడంతో ఆమేరకు చర్యలు చేపడుతోంది. స్థానికంగా ఉన్న వనరుల వివరాలతో పాటు ఏయే పరిశ్రమలకు సంబంధిత భూములు, ప్రాంతాలు అనువుగా ఉంటాయన్న విషయాలను నివేదికలో పొందుపరిచేందుకు సిద్ధమవుతోంది. భూములను గుర్తించిన తర్వాత ఆయా ప్రాంత చిత్రాలు (లోకేషన్ మ్యాప్‌లు) తయారు చేసి రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్ఐఐసీ)కి పంపించాలని నిర్దేశించడంతో అందుకు అనుగుణంగా కార్యాచరణకు వ్యూహరచన చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వ భూముల సమగ్ర సర్వేలో రెవెన్యూ యంత్రాంగం తలమునకలైనట్లు తెలుస్తోంది.



ప్రభుత్వ భూముల లెక్క ఇలా ..

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూముల గుర్తింపుపై ఆరా తీస్తున్న రెవెన్యూ యంత్రాంగం 12 మండలాల పరిధిలో 5,195 ఎకరాల ఉన్నట్లు రెవెన్యూ శాఖ లెక్క తేల్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రభుత్వ భూముల్లో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి? సంరక్షణలో ఎన్ని ఉన్నాయి? అన్న అంశాలను తేల్చేందుకు సమగ్ర సర్వేకు రెవెన్యూ శాఖ శ్రీకారం చుట్టింది. మేడ్చల్ జిల్లాలో బాలానగర్ మండలంలో 700 ఎకరాలు, శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపల్లి మండలంలో 900 ఎకరాలు, ఘట్కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రభుత్వ భూముల్లో దాదాపు 30 శాతానికి పైగా భూములు కబ్జాకు గురైనట్లు అంచనా వేస్తున్న రెవెన్యూ శాఖ సమగ్ర సర్వేపై దృష్టి సారిస్తోంది.

అసైన్డ్ భూములిలా ..

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో అసైన్డ్ భూముల వివరాలపై కూడా రెవెన్యూ యంత్రాంగం కన్నేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో 2004 వరకు ప్రభుత్వ భూములను ఎంత మందికి అసైన్డ్ చేశారనే విషయాలపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దష్టి సారిస్తోంది. మేడ్చల్ జిల్లాలో 116 గ్రామాలకు చెందిన 8, 230 మంది నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ కుటుంబాలకు 11, 384 ఎకరాల ప్రభుత్వ భూములను వ్యవసాయం (పంట సాగు), ఇళ్ల స్థలాల కోసం అసైన్డ్ చేశారని గుర్తించిన అధికార యంత్రాంగం మండలాల వారీగా సంబంధిత వివరాలపై ఆరా తీస్తోంది. అందులో భాగంగా ఘటేస్కర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలం 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలం 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలం 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలం 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలం 18 గ్రామాల్లో 855 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నట్లుగా రెవెన్యూ శాఖ గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ అసైన్డ్ భూములకు సంబంధించి నోటరీ క్రయ విక్రయాలు చాలా మేరకు జరగగా.. అనేక సంస్థలు వెలసినట్లు సమాచారం. అలాగే వందలాది ఎకరాల భూములు కూడా అన్యాక్రాంతమైనట్లు గుర్తించిన అధికార యంత్రాంగం ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు శనివారం 1కిలోకి ఈ విధంగా ఉన్నాయి. టమాట రూ.35, వంకాయ రూ.40, బెండకాయ రూ.65, పచ్చిమిర్చి రూ.35, బజ్జిమిర్చి రూ.60, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.55, క్యాబేజి రూ.23, బీన్స్ రూ.105, క్యారెట్ రూ.43, గోబిపువ్వు రూ.23, దొండకాయ రూ.35, చిక్కుడుకాయ రూ.85, గోరుచిక్కుడు రూ.55, బీట్‌రూట్ రూ.32, క్యాప్సికం రూ.75, ఆలుగడ్డ రూ.37, కీరా రూ.25, దోసకాయ రూ.35, సొరకాయ రూ.25, పొట్లకాయ రూ.18, కంద రూ.55, ఉల్లిపొరక రూ.55, ఉల్లిగడ్డ రూ.50, మామిడికాయ రూ.15 నుంచి రూ.20, అరటికాయ రూ.8 నుంచి 9, చామగడ్డ రూ.37, ముల్లంగి రూ.4 నుంచి 5, చిలగడ దుంప రూ.40, గుమ్మడికాయ రూ.30, మునగకాయలు రూ.8 నుంచి 10, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండుమిర్చి రూ.220, అల్లం రూ.160, వెల్లుల్లి రూ.380, చింతపండు రూ.140, పండుమిర్చి రూ.80, ఉసిరి రూ.100, కరివేపాకు రూ.70, పర్వల్ రూ.40, పల్లికాయ రూ.65, లోబా రూ.45, కాకరకాయ రూ.100 ధరలు ఉన్నాయి.

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

మోతీనగర్: సీనియర్ సిటిజన్ ఫోరం సహకారంతో ఫోరం భవనంలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దంత వైద్య నిపుణులు డాక్టర్ వివేక్ పర్యవేక్షణలో ఉచిత దంత వైద్య, అవగాహన శిబిరం నిర్వహించనున్నారు. మోతీనగర్, కల్యాణ్‌నగర్, బోరబండ, అల్లాపూర్, తులసినగర్, పర్వత్‌నగర్ వాసులు వినియోగించుకోవాలన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ గాంధీ నగర్‌లో శ్రీ కీర్తి హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ, షుగర్ వంటి అన్ని జనరల్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తూ అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాండు, శివరాజ్, భాస్కర్, ప్రభాకర్, సదానంద్‌గౌడ్, మల్లేష్, మహేష్, రమాదేవి, కుమార్, మధురెడ్డి, అజయ్, శ్రీను, వైద్య సిబ్బంది సురేందర్‌రెడ్డి, రమేష్, నిహారిక, అనిల్, కావ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్యుకేషన్ ఎక్స్‌పో



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ భారతి విద్యాలయ పాఠశాలలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్స్‌పో ఆకట్టుకుంది. శనివారం పాఠశాల ప్రాంగణంలో ఎల్‌కేజీ నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు వివిధ రకాల నమూనాలు, ప్రాజెక్టు తయారు చేశారు. పిల్లలు తెచ్చిన నమూనాలను పాఠశాల చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఉపాధ్యాయులతో కలిసి సందర్శించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి ప్రదర్శనలు తోడ్పడుతాయని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లితండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రూప్ 1 పరీక్షలు

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్ 1 పరీక్షలు శనివారం 6వ రోజు ప్రశాంతంగా జరిగాయి. 114 మంది దివ్యాంగులు, నలుగురు ఇతరులు మొత్తం 118 మంది పరీక్షలు వ్రాయాల్సి ఉండగా.. 92 మంది హాజరయ్యారు. 26 మంది హాజరు కాలేదని అధికారులు తెలిపారు. ఆదివారం చివరి పరీక్ష ఉంటుంది.

భారతీయ సంస్కృతి ఆదర్శం

బాలానగర్: కులాలు, మతాలకు అతీతంగా అందరు ఒక్కటే అనే భారతీయ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శమని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు మౌలానా అన్నారు. శనివారం ఇందిరాగాంధీ పురంలో జరిగిన మిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో పాల్గొని శాంతి సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో బాలానగర్ మాజీ కార్పొరేటర్ నరేంద్రాచార్య, మైనార్టీ నాయకులు ఎండీ నసీర్, ఎండి ఇమ్రాన్, అఫ్జల్ పాల్గొన్నారు.

అధిక శబ్దంతో డీజే ప్లే.. బార్‌పై కేసు నమోదు

కేపీహెచ్‌బీకాలనీ: అధిక శబ్దంతో డీజే ప్లే చేసిన మంజీరామాల్‌లోని కింగ్– క్వీన్ బార్ నిర్వాహకులపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. జేఎన్టీయూ రోడ్డులోని మంజీరామాల్‌లో గల కింగ్–క్వీన్ బార్ నుంచి శుక్రవారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో డీజే సౌండ్ అధికంగా వస్తుందంటూ స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెట్రోలింగ్ విధుల్లో ఉన్న గోపీకృష్ణ అక్కడికి చేరుకుని డీజేను ఆఫ్ చేయాలని సూచించాడు. అతని మాటను ఖాతారు చేయకుండా ఇంకా సౌండ్ పెంచారు. ఈ మేరకు గోపీకృష్ణ ఫిర్యాదు మేరకు పబ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్‌దే విజయం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బీఆర్‌ఎస్ శ్రేణులు.

కూకట్‌పల్లి: రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా, ఏ ఎన్నికలు అయినా బీఆర్‌ఎస్‌దే గెలుపు ఖాయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని వివరించారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు విసుగెత్తారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్‌ఎస్ శ్రేణులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. సమావేశంలో బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష, మాజీ కార్పొరేటర్ బాబురావు, అధ్యక్షులు సీహెచ్. ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావునగర్ హిందూ శ్మశాన వాటికలో కార్పొరేటర్ సబిహాబేగం దీపావళి సందర్భంగా జీహెచ్‌ఎంసీ సిబ్బందితో శనివారం చెత్తా చెదారాన్ని తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దీపావళి పండుగ సందర్భంగా హిందువులు తమ పూర్వీకులను స్మరించుకోవడానికి శ్మశానవాటికకు వస్తారని, వారికి ఇబ్బంది కలుగకుండా వ్యర్థాలు, కలుపు మొక్కలు లేకుండా తొలగింపజేసినట్లు తెలిపారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మూసాపేట డివిజన్‌కు చెందిన ఎండీ ఫక్రుద్దీన్‌కు మంజూరైన లక్ష రూపాయల సీఎం సహాయ నిధి చెక్కును కుటుంబ సభ్యురాలికి ఎమ్మెల్యే అందజేశారు. – కూకట్‌పల్లి

తప్పిపోయిన పెంపుడు కుక్క.. పోలీసులకు ఫిర్యాదు



మూసాపేట: ఇష్టంగా పెంచుకుంటున్న పెంపుడు కుక్క(క్లారా) తప్పిపోవడంతో కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శనివారం కుక్క యజమాని ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన విక్టర్ రాజ్ యజమాని పోమెరియేనియన్ జాతికి చెందిన కుక్కను పెంచుకుంటున్నాడు. 18 నెలల వయస్సు ఉన్న కుక్కను ముద్దుగా క్లారా అని పిలుచుకుంటున్నారు. బెంగళూరులో పని నిమిత్తం వెళ్లే క్రమంలో.. క్లారాను కూకట్‌పల్లి శాంతి నగర్‌లో ఉండే తన స్నేహితుడికి అప్పగించాడు. మరో స్నేహితుడు 5 రోజుల క్రితం క్లారాను సరదాగా బయటకి తీసుకెళ్లడంతో తప్పిపోయింది. యజమాని బెంగళూరు నుంచి రాగానే విషయం తెలుసుకొని క్లారా తప్పిపోయిందని, మెడకు బ్లాక్ కలర్‌లో చోకర్ ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హామీల అమలుకు ఉద్యమించాలి : సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం

కూకట్‌పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం అన్నారు. సీపీఎం కూకట్‌పల్లి మండల రెండవ మహాసభ శ్రీశ్రీనగర్ ఎంవీ భాస్కరరావు భవన్‌లో శనివారం ఘనంగా జరిగింది. హైదర్‌నగర్ శాఖ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు రాజారావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్యారంటీల అమలుకు ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

సీపీఎం మండల కార్యదర్శిగా శంకర్

మండల మహాసభలో పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఎం. శంకర్, కమిటీ సభ్యులుగా వి. శివప్రసాద్, కృష్ణ నాయక్, ఎల్‌డీ ప్రసాద్, ఏ. రంగారెడ్డి, పి. శ్రీకాంత్, పి. ధర్మారావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ కృష్ణారావు, సీనియర్ నాయకులు సుదర్శన్, నరసింహ, సునీత, అనురాధ, శివరంజిత్, బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. పాములు

- ఇళ్లలోకి విష సర్పాలు
- ఆందోళన చెందుతున్న స్థానికులు
- అపరిశుభ్రంగా నాలా, చెరువులు, కుంటలు
- ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు



ఆల్విన్‌కాలనీ నాలాలో కొండ చిలువను పట్టుకున్న స్నేక్ సొసైటీ సభ్యులు (ఫైల్)



నాలా ప్రాంతంలో దట్టంగా పెరిగిన చెట్ల పొదలు

ఆల్విన్‌కాలనీ: జన సంచారంలోకి విషసర్పాలు ప్రవేశించి భయాందోళనకు గురి చేస్తున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా విష సర్పాలు, పురుగులు ఇళ్ల మధ్యలోకి రావటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఎప్పుడు ఏ విషసర్పం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని పరికి చెరువు, ఎల్లమ్మ చెరువు, భీమునికుంట చెరువు, స్థానికంగా ఉన్న శ్మశాన వాటికల్లో చెత్తా చెదారంతో పాటు ఏపుగా పెరిగిన కలుపు మొక్కలు ఉన్నాయి. అవి దట్టమైన అడవిలా పెరగడంతో విష సర్పాలకు ఆవాసంగా మారాయి. ఇళ్ల మధ్యలో నుంచే నాలాలు కూడా ప్రవహిస్తుండటంతో విషసర్పాలు ఇళ్లల్లో వస్తున్నాయి. ప్రతి రోజూ ఎక్కడో ఒక ప్రాంతంలో విష సర్పాలు సంచరిస్తున్నాయి. సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు చెరువుల వద్ద, నాలాల వెంట ఉన్న కలుపు మొక్కలు, తీగ మొక్కలను తొలగించి విషసర్పాలు, విష పురుగుల భారి నుంచి కాపాడాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



జలవాయు విహార్‌లో ఇంటిలోకి వచ్చిన తాచుపాము

ప్రతి రోజు భయపడుతున్నం



చెరువులు, కుంటలు, శ్మశాన వాటికల్లో చెట్ల పొదలు పెరిగి దట్టమైన అడవుల్లా పేరుకుపోతున్నాయి. పొదల వెంట వ్యర్థాలు పేరుకుపోయి విష సర్పాలు, పురుగులకు ఆవాసంగా మారుతున్నాయి. అక్కడి ప్రాంతాలను శుభ్రం చేసి, చెట్ల పొదలను తొలగించి విష పురుగులు, సర్పాలు ఇళ్ల మధ్యలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. ప్రతి రోజూ భయంతో ఇళ్లల్లో ఉండాల్సి వస్తుంది.

– వివేక్, జలవాయు విహార్ నివాసి.

ఎన్‌ఎస్ 400 బజాజ్ వాహనంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బజాజ్ ఆటో లిమిటెడ్ అభినందన్ బజాజ్, వరుణ్ బజాజ్‌ల నిర్వాహకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్‌లో శనివారం బజాజ్ ఆటో లిమిటెడ్ అభినందన్ బజాజ్, వరుణ్ బజాజ్‌లు సంయుక్త ఆధ్వర్యంలో ఎన్‌ఎస్ 400 బజాజ్ వాహనంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వాహన ప్రియులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన బజాజ్ వాహనాలను నడిపి తమ అభిప్రాయాలను కంపెనీ నిర్వాహకులకు తెలిపారు. అనంతరం బజాజ్ ఆటో లిమిటెడ్ రీజినల్ మేనేజర్ కళ్యాణ్‌రెడ్డి ఎన్‌ఎస్ 400 ద్విచక్ర వాహనం వాహనాన్ని నడిపే విధానంతో పాటు వాటికి సంబంధించిన వివరాలను వివరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ స్టాలిన్, సేల్స్ మేనేజర్లు మౌర్య, సూర్య, సెలెక్ట్ బజాజ్ మేనేజింగ్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.